19

# భగవంతుడిని సంపూర్ణముగా శరణాగతి చెందిన శ్రీశేషుదేవులు

శ్రీ శేషుబాబుగారు 1972లో సర్వసంగ పరిత్యాగము చేసినప్పటి నుండి ఆయన మనోస్థితి పూర్తిగా మారిపోయినది. సత్యము కొరకు సర్వసంగపరిత్యాగము చేసి సిద్ధపురుషులైన ఆయనకు భగవంతుడే సమస్తమూ అయియున్నారు అనే నమ్మకము దృఢతరమైనది. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, బంధువులు, స్నేహితులు అన్ని బంధములు భగవంతుడే అయియున్నారనే అంతర్దృష్టి ఆయనలో ముద్రపడిపోయినది. ప్రేయసి ప్రియుని కొరకు ఆత్రుత చెందునట్లుగా ఆయన భగవంతుడినే స్మరిస్తూ, ప్రేమిస్తూ భగవంతుని కొరకు తీవ్రముగా ఆరాటపడేవారు. బంగారమును ఆభరణముగా తయారు చేయుటకు ముందుగా అగ్నిగుండములో వేసి కరిగిస్తారు. అలాగే సిద్ధులైన శ్రీ శేషుబాబు గారిలో ఆత్మవిమర్శ, వైరాగ్యము అనే దైవీశక్తులు మేల్కొని అంతర్గతముగా అగ్నిగుండము వలె రగులుచున్నవి. జాలి అనే దైవీశక్తి మేల్కొని తనకెదురయ్యే ప్రతివారి యొక్క దురదృష్ట సంస్కారములను దేహముపైకి స్వీకరించేసి, దైవీశక్తుల కర్మవలన లభించే అదృష్టఫలములన్నింటినీ ఇతరులకు దానము చేసేస్తున్నది. తద్వారా శ్రీ శేషుబాబుగారు అప్పటి వరకు ఎరిగియుండని దురదృష్టములు, అపజయములు, అనారోగ్యములు, విమర్శలు వంటివన్నీ ఆయన దేహము మీద పడిపోవుచున్నవి. భగవంతుని తెలుసుకోవాలి, భగవంతునితో సాంగత్యము చేయాలి, భగవంతునిలో కలసిపోవాలి అనే దైవీప్రేమ విరహాగ్ని ఆయన హృదయమును, ఆత్మను దహించివేస్తున్నది. పరీక్షలో అపజయము, అవమానము వంటి దురదృష్టములేవీ ఆయన కంటికి ఏ మాత్రము గోచరించుట లేదు. "కంటికి కనిపించే బాహ్య విషయాలన్నియూ తాత్కాలికమైనవి, అత్యల్పమైనవే అయియున్నవి. ఇవన్నియు ఈ అరవైయ్యేళ్ళ దేహజీవితానికి సంబంధించినవి మాత్రమే. ఆత్మ జీవితము అనంతమైనది, శాశ్వతమైనది. ఈ బాహ్య లాభనష్టములన్నీ ఆత్మ దృష్టిలో మట్టి బెడ్డల వంటివి మాత్రమే. ఈ దేహము పుట్టకముందు, మరణించిన తరువాత కూడా శాశ్వతముగా ఉండునది ఆత్మ జీవితమే. అట్టి ఆత్మకు ప్రియుడు పరమాత్మ. పరమాత్మ సాంగత్యము, పరమాత్మ కలయికయే ఆత్మకు ప్రియమైనది. ఆత్మను భగవంతుడు ఎల్లప్పుడూ సంపూర్ణముగా ప్రేమించుచున్నాడు. తిరిగి ఆత్మ భగవంతుడిని ప్రేమించి, భగవంతుడిలో కలసిపోవుటయే ఆత్మ యొక్క లక్ష్యము, లాభము అయియున్నది". అనెడి ఆత్మసాక్షాత్కారదృష్టి ఆయనలో సంపూర్ణముగా మేల్కొన్నది.

శ్రీ శేషుబాబు గారి ప్రవర్తన పూర్తిగా మారిపోయినది. రోజంతా 24 గంటలు సత్యచింతనలోనే నిమగ్నమైయుండేవారు. ఎప్పుడు చూసినా పరధ్యానముగా ఏదో ఆలోచిస్తూ ఉండేవారు. ఆహారము మీదకానీ, వస్త్రముల మీదకానీ, చదువు మీదకానీ, వినోదముల మీదకానీ దృష్టి, ఆసక్తి ఉండేవికావు.

భోజనం తినేటప్పుడు కూడా ఏదో

continue...

ఆలోచిస్తూ యాంత్రికముగా తినేవారే తప్ప, ఏమి తింటున్నారో కూడా చూసుకునేవారు కాదు. వారి ఇంట్లో ఒక పిల్లిని పెంచేవారు, ఆయన భోజనం చేసేటప్పుడు ఆ పిల్లి వచ్చి ఆయన ప్రక్కనే కూర్చునేది. ఆయనకు తన ప్రక్కన కూర్చున్నది పిల్లియో, మనిషో కూడా తెలిసేది కాదు. సత్యచింతనా నిమగ్నుడైయున్న ఆయన దానిలోనూ భగవంతుడినే చూసేవారేమో. ఆయన ఒక ముద్ద తిని పిల్లికి ఒక ముద్ద పెట్టేవారు. ఇంట్లోనివారు అది చూచి ఆశ్చర్యపోయేవారు. ఇంట్లో ఉండే దేవుళ్ళ ఫొటోలన్నింటికీ వరుసగా దణ్ణం పెట్టేవారు. నిద్రలేవగానే దణ్ణం పెట్టేవారు. ఏ పని చెయ్యాలన్నా ముందుగా అన్ని ఫొటోలకు దణ్ణం పెట్టేవారు. బయటకు వెళ్ళేటప్పుడు, బయటినుండి తిరిగి ఇంటికి వచ్చినపుడు కూడా దణ్ణం పెట్టేవారు. దణ్ణం పెట్టుకుని ఇంటి నుండి బయటకు వెళ్ళినాక ఒక్కొక్కసారి కొంత దూరం వెళ్ళి మరల ఏదో మరిచిపోయిన వానిలా వెనుకకు తిరిగివచ్చి మరల అన్ని ఫొటోలకు దణ్ణం పెట్టుకుని వెళ్ళేవారు. చిత్తము సర్వవేళలా దైవీచింతనా మగ్నమైయుండుటచేత, దైవీ రూపాలను పదే పదే చూస్తూయుండుట, అనుగ్రహించుమని వేడుకుంటూ ఉండుట ఆయనకు ఆనందాన్ని కలిగించేది. అందుకే పదే పదే దైవీ రూపాలకు సమస్కరించేవారు, చూసే వారికి మాత్రము శేషబాబుకు ఏమయినది ? చేసిన పనే మళ్ళీ మళ్ళీ చేస్తున్నాడేమిటి ? భక్తిభావము కలిగితే ఒక్కసారి దణ్ణం పెట్టుకుంటే సరిపోతుంది కదా, శేషబాబుకు చిత్తచాంచల్యమేమీ కలగలేదుకదా అని భయపడేవారు.

శ్రీ శేషబాబు గారు ఏ వ్యక్తితోను కలవకుండా ఒంటరిగా ఉండేవారు. ఏదో ఆలోచనతో పరధ్యానముగా ఉంటూ, తన ఎదుటకు వచ్చిన వారిని కూడా గుర్తించేవారు కాదు. ఇంట్లోనే ఉన్నప్పటికీ కుటుంబ సంబంధమైన ఏ విషయాలను పట్టించుకునే వారు కాదు, దేనిలోను కలగచేసుకునేవారు కాదు. సమస్తాన్నీ త్యజించి అరణ్యానికి వెళ్ళి తపస్సు చేసుకునే వ్యక్తి ఏ విధముగా ఏకాంతముగా ఉంటారో, శ్రీ శేషబాబు గారు అందరి మధ్యలోనే కుటుంబములోనే ఉంటూ కూడా అదే విధమైన ఏకాంతమును అనుభవించేవారు. మనస్సులో నిరంతరము తపస్సు కొనసాగుచునేయుండేది. కుటుంబసభ్యుల మధ్యనే ఉంటూ కూడా ఆ కుటుంబముతో తనకు సంబంధము లేనట్లుగా, తన కుటుంబము ఎక్కడో ఉన్నట్లుగా, భగవంతుడే తన కుటుంబము అన్నట్లుగా మసలేవారు. ఒక శిష్యుడు శ్రీ యేసుప్రభువు వద్దకు వచ్చి తాను వెళ్ళి మరణించిన తన తండ్రి శవమును పాతిపెట్టి వచ్చుటకు సెలవిమ్మని అడుగగా, "మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్ము. నీవు నన్ను వెంబడింపుము". అని శ్రీ యేసు ప్రభువు చెప్పియున్నారు. ఆ విధముగా శ్రీ శేషబాబు గారు తమ దేహబంధములన్నిటినీ మృతప్రాయముగా విడిచి పరమతండ్రినే సంపూర్ణ నమ్మకముతో వెంబడించినారు. ప్రతిక్షణము సత్యస్మరణలోనే నిమగ్నమైయుండేవారు. కుటుంబసభ్యులకు ఆయన తమ మధ్యనే ఉంటున్నప్పటికీ తమలో ఒకనిగా ఉండుట లేదని, వేరేదో లోకములో ఉన్నట్లుగా పరధ్యానముగా దూరముగా ఉంటున్నారని అర్థమయినది.

continue...

శ్రీ శేషబాబు గారు చదువు, ఆహారము, వస్త్రములు వేటి మీద ఆసక్తిగానీ, శ్రద్ధగానీ చూపేవారు కాదు. భవిష్యత్తును గూర్చిన చింతగానీ, భయముగానీ ఆయనలో అణుమాత్రమైనా గోచరించేవి కావు. "ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి. ఆహారము కంటే ప్రాణమును వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా? ఆకాశ పక్షులను చూడుడి, అవి విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు. అయినను మీ పరలోకపుతండ్రి వాటిని పోషించుచున్నాడు. మీరు వాటి కంటే బహుశ్రేష్ఠులు కారా? కావున ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో, ఏమి ధరించుకొందుమో అని చింతింపకుడి. అన్యజనులు వీటన్నింటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును." అని బైబిలులో శ్రీ యేసుక్రీస్తు చెప్పిన సత్యవాక్యమును శ్రీ శేషబాబు గారు జీవితములో సంపూర్ణముగా ఆచరించి చూపెడివారు. భగవంతుడే తనను పోషిస్తారు అనే దృఢమైన విశ్వాసముతో లోక సంబంధమైన చింతనలు, భయాలు పూర్తిగా వదిలేసినారు.

శ్రీ శేషబాబు గారు చిన్నతనము నుండి బొద్దుగా, అందముగా ఉండేవారు. కానీ ఆహారముమీద, శరీరము మీద శ్రద్ధ కోల్పోయి నిరాసక్తముగా ఉండుట చేతను, అంతఃకరణములో ప్రేమ విరహాగ్ని దహించివేయుచుండుట చేతను 1972 నుండి ఆయన పూర్తిగా నీరసించిపోయి చాలా సన్నముగా అయిపోయినారు. గాలి వేస్తే ఎగిరిపోతారేమో అనేటంత సన్నముగా కనిపించేవారు. దేహము అంత సన్నముగా ఉన్నప్పటికీ మనస్సు చాలా బలముగా ఉండేది. నిల్చొనియుండి ఎన్ని గంటలైనా ఏకధాటిగా సత్య విషయాలను మాట్లాడేస్తూ ఉండుటలో ఆయనకు ఏ విధమైన అలసటయు కలిగేది కాదు. దేహము చిక్కిపోయినది అనే ఆలోచనయే ఆయనకు ఉండేది కాదు. అంత సన్నముగా ఉన్న ఆయన అన్ని గంటల సేపు అలసిపోకుండా అనర్గళముగా మాట్లాడుతుంటే, చూసే వారందరూ ఆశ్చర్యపోయేవారు. దేహము చిక్కిపోయినది అనే ఆలోచనయే ఆయనకుండేది కాదు. ఆ రోజులలో యువకులందరూ అప్పటి ఫ్యాషను ప్రకారము బెల్‌బోటమ్ ఫ్యాంటులనే ధరించెడివారు. కానీ ఆయన మాత్రము తన పాత నేరోకట్ ఫ్యాంటులనే ధరించి కాలేజీకి వెళ్ళేవారేగానీ క్రొత్త బెల్‌బోటమ్ ఫ్యాంటులు కుట్టించుకునేవారు కాదు. కాలేజీలో అందరిలోకి ఆయన దుస్తులే వేరుగా ఉండుటచేత అందరూ విచిత్రముగా చూచేవారు. కానీ ఆయనకు అసలు దుస్తుల గూర్చిన ఆలోచనే ఉండేది కాదు. లోక సంబంధమైన ఆచారములు, ఫ్యాషన్‌లు, దూషణ-భూషణలు అన్నీ ఆయన దృష్టికి రోతవలె అసహ్యముగా కనిపించేవి.

లోకసంబంధమైన దేనిని గూర్చియు చింతించేవారు కాదు, లోకసంబంధమైన దేనికొరకు భగవంతుడిని కోరేవారు కాదు. సమస్తాన్ని విడచి భగవంతునిపైనే

continue...

సంపూర్ణముగా నమ్మకముంచినారు. ఆయన యొక్క నిష్కపట, పరిశుద్ధ అంతఃకరణలో సత్యసంబంధమైన నమ్మకము, ధైర్యము, త్యాగము, పరిపూర్ణముగా ప్రతిష్ఠింపబడినవి. "నాగటి మీద చేయి పెట్టి మరల వెనుదిరిగి చూచువాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడు కాడు" అని శ్రీ యేసుప్రభువు చెప్పియున్నారు. శ్రీ శేషబాబు గారు తనకున్న కీర్తి, కనకము, సౌఖ్యము, బంధములు అన్నింటిని సంపూర్ణముగా త్యజించి సత్యమునే దృఢముగా పట్టుకున్నారు. కుటుంబ బంధాలన్నిటినీ వదిలేస్తే ఒంటరినైపోతానేమోనని జీవితము గురించిగానీ, చదువును ధనాన్ని నిర్లక్ష్యము చేస్తే భవిష్యత్తు బాగుండదేమోనని ధనమును గురించిగానీ, లోక పద్ధతిలో నడవకపోతే లోకము యొక్క విమర్శలు, హేళనలు, దూషణలు ఎదుర్కోవలసి వస్తుందేమోనని కీర్తి గురించిగానీ, ఆకలిదప్పులు కూడా మరిచిపోయి, దేహ అవసరాలను పూర్తిగా విస్మరించి, సత్యచింతనలో నిమగ్నమైయుండగా దేహము కృషించిపోవుచున్నప్పుడు ఏమైపోతానోనని ప్రాణమును గూర్చిగానీ ఏనాడూ ఆయన చింతించలేదు, ఏ మాత్రము భయపడలేదు. అణుమాత్రమైన లోకమువైపు వెనుదిరిగి చూడకుండా సత్యమునే సంపూర్ణముగా నమ్మినారు. సగము నమ్ముట, సగము ఆలోచించుట వంటి అసంపూర్ణ పనులాయనలో ఏనాడూ గోచరించలేదు.

పరిపూర్ణమైన విశ్వాసముతో భగవంతుడినే శరణాగతి చెందినవారి సమస్త బాధ్యతలు భగవంతుడే వహిస్తారు. శ్రీ మహాభారతములో ద్రౌపదీ వస్త్రాపహరణము ఘట్టములో దుస్సాశనుడు శ్రీ ద్రౌపదీదేవి చీరను లాగుచున్నప్పుడు మొదట ఆమె తన చేతులతో చీరను గట్టిగా పట్టుకుంటూ శ్రీకృష్ణుడిని ప్రార్థిస్తారు. కానీ అప్పుడు శ్రీకృష్ణుడు రక్షించుటకు రారు. చివరకు ద్రౌపదీదేవి తన ప్రయత్నము మీద నమ్మకము విడిచిపెట్టి పరిపూర్ణ నమ్మకము శ్రీకృష్ణునిపైనే ఉంచి చీరను విడచి రెండు చేతులతో శ్రీకృష్ణుడికే నమస్కరించి సంపూర్ణ శరణాగతి చెందగానే శ్రీకృష్ణుడు వచ్చి అక్షయముగా చీరను ప్రసాదించి ఆమెను రక్షించినారు. అలాగే శ్రీ మద్భాగవతములోని గజేంద్రమోక్షము ఘట్టములో శ్రీ గజేంద్రుడు మొసలితో పోరాడుచూ రక్షించమని శ్రీ మహావిష్ణువును ప్రార్థించినప్పుడు శ్రీమహావిష్ణువు రక్షించుటకు రాలేదు. శ్రీ గజేంద్రుడు తన ప్రయత్నము మీద నమ్మకము విడచిపెట్టి మొసలితో పోరాటము మానివేసి సంపూర్ణ నమ్మకముతో భారమంతా శ్రీ మహావిష్ణువు పైననే వేసి సంపూర్ణ శరణాగతితో ప్రార్థించగానే శ్రీ మహావిష్ణువు వచ్చి మొసలిని సంహరించి శ్రీ గజేంద్రుని రక్షించినారు. పరిపూర్ణ శరణాగతియే భగవంతునికి ప్రీతిపాత్రమైనది.

శ్రీ శేషబాబు గారు మొదటి నుండియు సంపూర్ణ నమ్మకముతో, సర్వసమర్పణ భావముతో, భగవంతుడే తండ్రియనే విశ్వాసముతో, పుత్రభావముతో పరిపూర్ణశరణాగతి చెందియున్న సంపూర్ణ విశ్వాస స్వరూపులైయున్నారు. పుత్ర భావముతో శరణాగతి చెందిన శ్రీ గురుదేవుల వద్దకు భగవంతుడే స్వయముగా వచ్చి జీవితకాలమంతా ఆయనను ప్రేమాభిమానములతో ఆదరించి ఎత్తుకొనియేయున్నారు. తండ్రి కుమారునికి

continue...

తన సమస్త రాజ్యమును అప్పగించినట్లుగ పరమతండ్రియే తన కుమారునిలో అవతారునిగా మేల్కొని, తనయొక్క భగవత్ సింహాసనముపైన కుమారుడిని కూర్చోబెట్టే వరకు ఎత్తుకునియేయున్నారు. శ్రీ శేషుబాబు గారి జీవిత కాలమంతటిలో ఎప్పుడూ, దేనికొరకూ, ఎవ్వరిపైనా ఆధార పడియుండలేదు. ఎవ్వరూ ఎన్నడూ ఆయనకు ఎట్టి సేవయు చేయలేదు. భగవంతుడే ఎల్లప్పుడూ తండ్రిలా రక్షించినారు. శ్రీ గాయత్రీమాతలా సర్వకాల సర్వావస్థల యందును సేవ చేసియున్నారు. ఎప్పుడు ఎవ్వరు శ్రీ శేషుబాబు గారికి సేవ చేయుచున్నట్లు కనిపించినాగానీ అప్పుడు ఆ వ్యక్తులు శ్రీ శేషుబాబు గారిచేత సేవ చేయించుకుంటున్నారన్నదే సత్యమైయున్నది. నిరాకారమందుండి శ్రీ శేషుబాబు గారికి సేవ చేయుచున్న దైవీశక్తుల చేత శ్రీ శేషుబాబు గారే ఆ వ్యక్తులకు సేవ చేయుచున్నారనునదే సత్యమైయున్నది. ఉదాహరణకు 1995లో శ్రీ శేషుబాబు గారితో నిరాకారముగా సాంగత్యము చేయుటకై వచ్చిన శ్రీ శిరిడి సాయిబాబా వారి ఆత్మను శ్రీ శేషుబాబుగారే శ్రీనుబాబు యెడల గల జాలితో అతనిలో ప్రవేశింపచేసినారు. ఆ ఆత్మ ప్రభావముచే తదుపరి కాలములో శ్రీనుబాబు శ్రీ శేషుబాబు గారితో సత్యసాంగత్యము, జ్ఞానసేవ చేయుట జరిగినది. చూసేవారికి శ్రీనుబాబు శ్రీ గురుదేవులకు జ్ఞాన సేవ చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. కానీ అప్పుడు అతనికి శ్రీ శేషుబాబు గారే శ్రీ సాయిబాబా వారితో జ్ఞాన సాంగత్యము చేసే మహోన్నతమైన, అనితర సాధ్యమైన సేవను చేయుచున్నారనునదే సత్యమైయున్నది. ఆ విధముగానే శ్రీ శేషుబాబు గారి జీవితకాలమంతటిలో ఆయనకు ఎప్పుడు ఎవ్వరు ఏ సేవ చేయగలిగినను గానీ ఆ సమయములో వారి యందు దేవతాశక్తులు ఉంటేనే సేవ చేయగలిగినారు.

శ్రీ శేషుబాబుగారు సంపూర్ణ శరణాగతితో పరమతండ్రినే తండ్రిగా పొందియున్నారు. ఆయన లోక సంబంధీకుడు కారు కనుక మనుష్యులెవ్వరూ ఆయనకు సేవ చేయలేదు. మనిషి ఎంత మంచివాడైనాగానీ, ఎంత దగ్గర బంధమును కలిగియున్నా గానీ ఆయనను వ్యతిరేకిస్తాడేగానీ ఎవ్వరూ ఆయనకు సేవ చేయలేరు. పరమతండ్రియే తన కుమారునికి సేవ చేస్తారు. పరమతండ్రియే ఆయన బాధ్యతను స్వీకరించి ఆయనకు సర్వవేళలా సేవ చేయుచూ రక్షించుటకై దైవీ, దేవతా శక్తులను నిరాకారమందు నియోగించియున్నారు. శ్రీ గురుదేవులకు తన చుట్టూ ఉన్న వారిపై గల జాలితో, ప్రేమతో అట్టి దేవతాశక్తులను వారిలో ప్రవేశపెట్టినప్పుడు, ఆ శక్తులు వారిలో ఉండి శ్రీ గురుదేవులకు సేవ చేసియున్నారు. ఆ సత్కర్మ ఫలముగా లభించే స్వర్గఫలమును ఆ శక్తులు ఆ వ్యక్తుల దేహములకే ఇచ్చివేస్తారు. కావున ఆ వ్యక్తులు లాభము, సుఖమువంటి స్వర్గఫలాలను పొందుతారు. ఎవరైతే ఈ సత్యమును గ్రహించక తామే శ్రీ గురుదేవులకు సేవ చేస్తున్నామనే భ్రమకు, తదాత్మ్యమునకు లోనైపోతారో వారి నుండి దేవతాశక్తులు తొలగిపోతారు. దేవతా శక్తులు తొలగిపోతే ఆ వ్యక్తి శ్రీ గురుదేవులకు ఏ మాత్రమూ సేవ చేయలేకపోగా అపకారమే చేస్తాడు, ద్వేషిస్తాడు.

continue...

కావున శ్రీ గురుదేవులకు సేవ చేయగలుగుచున్న ప్రతివ్యక్తి తానట్టి సేవ చేయుటలేదని శ్రీ గురుదేవులే దేవతా శక్తులతో తనకు సేవ చేయుచున్నారనే సత్యమును తప్పనిసరిగా గ్రహించుకోవలసియున్నది. ఈ సత్యమును గ్రహించుకున్నవారే శ్రీ గురుదేవుల సేవను శాశ్వతముగా నిలుపుకోగలుగుతారు. తద్వారా దేవతాశక్తుల ద్వారా స్వర్గఫలములను, ఆత్మాభివృద్ధిని పొందగలుగుతారు. సర్వదేవతాశక్తి ప్రదాతయగు శ్రీ శేషుదేవులే అట్టి సత్యజ్ఞానమును మనకు ప్రసాదించాలని కోరుకుందాము.

